# బడి తోట

మేనేజిమెంటు వారి బదిలీ పుత్తర్వు పురస్కరించుకొని, మూటా ముల్లె సర్ది కుటుంబ సమేతంగా బయలుదేరాను కమలాపురానికి. శరీరంమాత్రం పోతూంది గానీ మనస్సుమాత్రం విడిచిపోతూన్న గ్రామం పైననే మసలుతూంది. పంతులుగారంటే ఆగ్రామస్థులకుండే ప్రేమ, ఆ విద్యార్థులకుండే భక్తి, విశ్వాసాలు, ఆ తలిదండ్రుల ఆదరణ యివన్నీ తలచుకొంటూంటే నామనస్సు పరిపరి విధాల ఖేదపడడం ప్రారంభించింది. విధివైపరీత్యాన్ని నిందించుకొంటూనే బయలుదేరాను.

పది గంటలకల్లా కమలాపురం చేరుకొన్నాను. బస్సుదిగి నేరుగా బడికెళ్లాను. బడిస్థలం మాత్రం చాలినంతగా ఉంది. ఒక పెంకుటిల్లు, ఒక పూరియిల్లు ఉంది. బడి వెనుకనే ఆటస్థలం. బడి ముంగిట కూడా ఖాళీజాగా వుంది నేను బడిలో కాలుపెట్టగనే సహాయోపాధ్యాయుడు యెదురుగా వచ్చి చేతనున్న సంచి తీసుకొని లోపలికి తీసుకెళ్లాడు. కొద్దిసేపు సేదతీర్చుకొని, సహాయోపాధ్యాయుడు తెప్పించిన చన్నీళ్లుత్రాగి ప్రధానోపాధ్యాయుడుగా చార్జి పుచ్చుకొన్నాను. ఆ దినమే పూరింటనున్న తరగతులను పెంకుటింటికి మార్చి, పూరింట తాత్కాలికంగా కాపురం పెట్టాము నేనూ,నాభార్యా.

సాయంత్రం బడి వదలగనే బయలుదేరి గ్రామంలోకిపోయాము.

సహాయోపాధ్యాయుడు చాలా మందికి నన్ను పరిచయం చేశాడు. అందులో ముఖ్యంగా గ్రామమునసబు, మాజీ పంచాయితీబోర్డు ప్రెశిడెంటు, కులపెద్ద యిత్యాదులున్నారు. అందరూ సరిఅంటే సరిఅన్నారే గానీ ఆదరించిమంచినీళ్లిచ్చినపాపాన పోలేదు. అంతటితోనే ఆ గ్రామపరిస్థితి యేలాగుంటుందో అర్థం చేసుకొన్నాను. తిరిగివస్తూ చేతనున్న ఐదురూపాయలకు శెట్టి అంగట్లో బియ్యము, నూనె, ఉప్పు వగైరా జీవితావసర వస్తువులు కొని బడిచేరుకొన్నాను మాఆవిడకు

ఎస్. గోపాలరెడ్డి


గ్రామపరిస్థితులన్నీ చెప్పి, యెలా పొదుపుగా నడచుకోవలసిందీ చెప్పాను. మాఆవిడసైతం విస్తుపోతూ "యిదేంటండీ! స్వర్గంలాంటి గ్రామంవదలి యీ నరకంలాంటి వూరొచ్చేశాము. తిరిగీ అచ్చటికే మార్చుమని దరఖాస్తు చేయండి." అంది. "అలాగే చేద్దాం" అంటూ రోజులు గడుపుకపోతున్నాం.

పక్షంరోజులు గడచేసరికే మేనేజిమెంటువారి ధర్మమా అంటూ జీతం రాళ్లు పంపారు. అంతతో కొద్ది తృప్తికలిగి యిక బళ్లో కాపురం చేయడం యేమంత బావుండదనుకొని గ్రామంలో యేదైనా ఇల్లు చూద్దామని బయలుదేరాను. యెంత వెదకినా ఒక్క యిల్లైనా యిస్తానన్న పుణ్యాత్ముడు లేకపోయాడు. చివరికి, విసుగెత్తి సహాయోపాధ్యాయుణ్ణే కూడా చూడమన్నాను. ఆయన వారం రోజులు తిరిగి తిరిగి గ్రామమునసబు సిఫార్సుతో ఒకగుండ్రని గుడిసె దొరికిందన్నాడు. దానికీ మూడు రూపాయలు కిరాయి! యేదోవొకటి దొరికిందనే తృప్తితో ఆగుడిసెలోనే కాపురం ప్రారంభించాము.

ఆయింటికి మేము తెచ్చిన సామాన్లే సరిపోయాయి. యిక పడుకొనడం, కూర్చోవడానికి సైతం యింటిముంగిట ఒక పందిరి తయారుచేయించుకొన్నాను. ఆ గ్రామాన డబ్బులుంటే గానీ ఒక్కవస్తువు దొరకదు. మజ్జిగనీళ్లు మొదలుకొని కూరగాయలవరకూ ఉచితంగా యివ్వరు సరిగదా బాకీ కూడా యివ్వరు. అదేమంటే యింతకముందు వున్న పంతులొకడు బాకీలన్నీ యెగ్గొట్టి వెళ్ళిపోయాడట అందుకని నాకివ్వనన్నారు. యిలా అతికీ అతకని సంసారంతో ఒకమాసం గడిచింది.

ఒకనాడు డిప్యూటీ యిన్స్పెక్టరుగారు మాబడిని విజిట్ చేశారు. బడినిగురించి, చదువును గురించి అన్నీ బావుందనే వ్రాశారు కానీ బడితోట లేకపోవడం చాలా పొరబాటని, దీనినిబట్టి చూస్తే పంతుళ్ళ సోమరితనం బయటపడుతున్నదని, మరోమారు దర్శించేలోగా బడితోట లేకుంటే పంతుళ్లపై చర్య తీసుకోబడునని వ్రాసి వెళ్లారు. ఈ విషయమై సహాయోపాధ్యాయునితో చెప్పాను. "బడితోట నిర్మిం

చకపోతే చర్యతీసుకొంటారని, తర్వాత మనం చాలా యిబ్బందులు పడవలసివస్తుందని, యేలాగూ మనం కూరగాయలు కొంటున్నాము గనుక తోటపెంచితే అందులో కాయలు మనమే వుపయోగించుకోవచ్చునని, అందువలన మనకు కొద్ది ఆదాకూడా వుంటుందని" బడితోటయొక్క అవసరాన్ని గూర్చి చెప్పాను. ఇందుకు సహోపాధ్యాయుడుకూడా "సరి" అన్నారు. పిల్లలసాయంతో వంగ, మిరప చిక్కుడు, బీర, సొర, పొట్ల యితాదుల విత్తులను చేర్పించాము. బడి ముంగిట స్థలాన్ని బాగుగా త్రవ్వించి, ఎరువువేయించి, విత్తులు నాటించాము. బడిలో బావి లేని కారణాన నీటిసమస్య కొద్ది కష్టమనిపించింది. ఇందరు పిల్లలుండగా నీటికేమి కొఱతని ప్రతిదినం సాయంత్రం పిల్లల సాయంతో బయట బావులనుండి నీరు తెప్పించి పోయడం ప్రారంభించాము. ఇలా ఓ పదిరోజులు గడచింది.



"మీరు ప్రతిరోజూ పిల్లలచేత నీరు తెప్పించుచున్నారట. మనసెరిగి మసలుకోండి"

ఒకనాడు మాజీ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగారు బడికొచ్చారు. నేనూ లేచి యెదురుగా వెళ్లి, లోపలికి తీసుకొచ్చి బడి బాగోగులను గూర్చి వరుసగా వివరించాను. అన్నీ సావధానంగా విన్నారు. తర్వాత "పంతులుగారూ! మిమ్మల్ని గూర్చి మా గ్రామంలో మహాచెడ్డగా చెప్పుకొంటున్నారు" అన్నాడు. నాకు కడుపున నిప్పు పడ్డట్టయింది. "యేమండీ అలాగంటారు" అన్నా. "అవును. మీరు ప్రతిరోజూ పిల్లల చేత నీరు తెప్పించుచున్నారట. ఇలాగ యిదివరకున్న ఉపాధ్యాయులెవరూ చేసియుండలేదు. మా గ్రామంవాళ్ళంతా హెచ్చుకులానికి చెందినవారు. వారిచేత యిలాంటిపనులు చేయించడం యేమంత బావుండదు. గాన మనసెరిగి మసలుకోండి" అని సలహాచెప్పి వెళ్లిపోయారు. నేను యిదివిని అలాగే స్తంభించిపోయానంటే నమ్మండి. నా జీవితంలో యిలా యేతల్లీతండ్రీ అన్న పాపాన పోలేదు.

బడితోటలో విత్తులన్నీ మొలకలెత్తాయి గ్రామంలో యిలాగున్నదని తెలియడంచేత ఆనాటినుండి ప్రతిదినం నీరుపోయడం మాన్పించి, రెండురోజుల కొకమారు పోయునట్లేర్పాటుచేశాను. పక్షంరోజుల కల్లా మొక్కలన్నీ బాగా ఎదగడం ప్రారంభించాయి. కాకర, బీర, సొర, పొట్ల యిత్యాదులన్నీ తీగలు వదలి ప్రాకులాడడం ప్రారంభించాయి ఇలా వుండగా ఒకనాడు యెవరివో కొన్ని పశువులు వచ్చి తోటంతా నాశనంచేసి వెళ్లాయి. ఇకకంపలు కట్టకపోతే ప్రయోజనం లేదని ఒక ఆదివారం పెద్దపిల్లలు కొందర్ని పిలుచుకొని చేనుకెళ్లాము. కావలసినన్ని కంపలుకొట్టి తీసుకొచ్చి బడితోటకు భద్రంగా వేశాము.

# ★ బడితోట ★

ఆ మరునాడు గ్రామమునసబుగారు మా బడికి వేంచేశారు. వచ్చిందే తడవుగా "యేమండీ పంతులుగారూ! తమరు కొద్దిగా గ్రామస్థుల గౌరవాన్ని కూడా గుర్తించండి." అన్నాడు. "ఏమండీ నేను ఆలా యెవ్వరినీ అగౌరవించలేదే" అన్నాను. "అదేమిటండీ అందరి పిల్లల చేతా నీరు తెప్పించడం, కంపలు కొట్టించడం యిదంతా యేమిటనుకొన్నారు. ఇదివరకున్న పంతుళ్లెవరూ యిలా చేయించలేదు. గాన గమనించి తిరుగండి" అంటూ హెచ్చరిక చేసి వెళ్లారు మునసబుగారు.

ఆ నాటినుండి నాకు బడితోటంటే కొద్దిగా మనసు విరిగింది. పిల్లలచేత యింక యేలాటిపనీ చేయించరాదనే తీర్మానానికి వచ్చాను. కానీ మొక్కలన్నీ పువ్వులుపూసి కాయలు కాయడానికి ప్రారంభిస్తున్నాయి. పొట్ల, కాకర, చిక్కుడు యిలాంటి పన్నీ తమతమ తీగలతో కంపలను కప్పేసి తోరణాలవలె పిందెలను, పువ్వులనూ వ్రేలాడదీసినయ్. పాములు వచ్చి తీగలను కరుస్తున్నాయా అన్నట్టు పొట్లపిందెలు తీగనుండి వ్రేలాడుతున్నాయి. అప్పుడప్పుడే పువ్వునుండి బయటికొస్తూన్న బెండపిందెలు బంగారు కడ్డీలలాగా ఎండకు మెరుస్తున్నాయి. గోరుచిక్కుళ్లు ముత్యాల్లాగా గుర్తులు గుత్తులుగా పువ్వులు తొడిగిఉంది. వీటినంతా చూస్తూంటే నాకు వాటి నాలాగే నీరు పోయకుండా యెండబెట్టటానికి మనసు రాలేదు. ఈ సంగతి సహోపాధ్యాయునికి కూడా చెప్పాను. ఆయనకూడా తోటకు నీరుపోయకమానడం బాగులేదన్నాడు. ఆనాటినుండి మేమిరువురూ సాయంత్రపువేళలో బక్కెట్టు తీసుకెళ్లి నీరు తెచ్చి పాదులకు పోసేవారము. ఆదివారములలో సైతం తోటలో కలుపు తీయడం, గొప్పు త్రవ్వడం, కంప కట్టడంలాంటి తోట పనులలో పాల్గొనేవారం.

కష్టానికితగ్గ ఫలితమే యన్నట్టు తోటకూడా దినదినాభివృద్ధిచెందుతూ ఫల, పుష్పసంభరితమై చూచువారల కన్నులు మిరుమిట్లు గొలుపునట్లుగా దారిని పోతున్నవారిని సైతము విభ్రాంతుల జేయడం మొదలెట్టింది. తేనెటీగల్లాగా గ్రామస్థులంతా వరుసగా తోటకు రావడం, కాయల్నిపట్టి చూస్తూండడం. "ఒకమణుగు వంకాయలవుతుందండీ" అని ఒకరు, "వంద

---


పింఛన్ పుచ్చుకొనన యిద్దరు ప్రభుత్వోద్యోగులు ఒకనాటి సాయంకాలం పార్కు బెంచీమీద కూర్చొని చాలాసేపు జీవితాన్నిగురించి మాట్లాడారు. ఆ మాటల ధోరణిలో ఒకరు "నీ చిన్ననాటి కోరికల్లో ఏవైనా తీరాయా?" అని రెండో ఆయన్ను అడిగారు.

"ఆఁ! ఒక్కటి మాత్రం తీరింది!"

"ఏమటదీ?"

"ఏమీలేదు. చిన్నప్పుడు నేను అల్లరిచేస్తే మా అమ్మ నాజుట్టు పట్టుకు ముందుకువంచి వీపుమీద తన్నేది. అటువంటి సందర్భాలలో యీ దిక్కుమాలిన జుట్టులేకుండా వుంటే బాగుండునుకదా అనిపించేది. ఆ కోరిక యిప్పటికి పూర్తిగా తీరిపోయింది." అంటూ తల తడువుకొన్నాడు రెండో ఆయన.

---

సొరకాయలు కాసిందండీ". అంటూ మరొకరు, "రెండు తట్ల బెండకాయలవుతుందండీ!" అని మరొకరు యిలాగ చెప్తూపోతూండే వారు. మాకూ కాయలు కోయడానికి చేతులురాక ఆలాగే ఉంచాము.

అకస్మాత్తుగా ఒకనాడు డిప్యూటీ యిన్స్పెక్టరుగారు మా బడికి విజిట్టుచేయడానికొచ్చారు. బడితోట చూచి చాలా సంతోషపడ్డారు. "పంతులూ! అయ్యగారికి కొన్ని కాయలిప్పించండీ" అన్నాడు డి. ఐ. జవాను. ఆలాగేనంటూ సహోపాధ్యాయునితో చెప్పి రకానికి కొన్నికోసి యిప్పించాను. డిప్యూటీ యిన్స్పెక్టరుగారు సంతుష్టులై "ఈ ప్రధానోపాధ్యాయుడు చాలా గట్టివాడని, ఇతను వచ్చాక బడి అన్నివిధాలా సంపూర్ణాభివృద్ధి పొందిందని, ఒక్క బడితోటలోనే ప్రస్తుతం యాభైరూపాయలకూరలు పండించియున్నాడ"ని బలేబలే వ్రాసి వెళ్లారు. మేమూ డి.ఐ. గారి విజిట్టు రిపోర్టు చూచి సంతోషపడి ఆనాడే వాటి కాపీలు తీసి మేనేజిమెంటుకు కూడా పంపేశాము. ఇక ఆఫీసర్ల బాధ్యత తీరిపోయిందంటూ ఆమరునాడు రెండు సొరకాయలుకోసి, సహోపాధ్యాయుని కొకటిచ్చి, నేనొకటిపుచ్చుకొని యింటికి బయలుదేరాను. ఎదురుగా ఆగ్రామ కులపెద్ద వచ్చి నేకోసుకెళ్తున్నకాయను చూచి "పంతులూ! బడితోటలో బలే బలే కాయలు కాసినాయటనే! మాకూ రెండు పంపవయ్యా!" అన్నాడు. నరేనని మధ్యాహ్నం బడికి రాగానే రకానికి కొన్ని కాయలు కోయించి గ్రామపెద్దకు పిల్లలచేత పంపించాను. అదెల్లా పాకిందో యీవార్త? కాసేపటి కల్లా మునసబు పంపాడని ఒకరు, మాజీపంచాయితీ ప్రెశిడెంటు పంపాడని మరొకరు యిలా గ్రామమంతా కూరగాయలకు వచ్చేశారు. నేనూ చేసేదిలేక కొన్ని కోయించి మునసబు, ప్రెశిడెంటులకు పంపి మిగిలిన వారందరికీ ఉదయం పంపిస్తానని నచ్చచెప్పి పంపించాను.

తెల్లారేసరికే మాయింటిచుట్టూ గ్రామస్థులంతా ప్రోగయ్యారు. ఎవరిని పలుకరించినా అందరూ



"ఎవరో?"

ఫోటో: డి. బి. రాజు (ద్రాక్షారామ)

# బడితోట

కాయగూరలకే వచ్చామన్నారు. ఇంతమాత్రం గ్రామస్థుల మనస్సు బడిపై కేంద్రీకరించాం గదా? అనే సంతోషంతో సహోపాధ్యాయుని పిలుచుకరమ్మని బడికి బయలు దేరాను గ్రామస్థులంతా మా వెంట చేతిసంచులు పట్టుకొని వస్తూంటే సగర్వంగా నడుస్తున్నాము మేము. తీరా తోటకెళ్ళి చూచాం గదా యేముంది? యేమీలేదు. ఒక్క పిందైనా లేదు. తోటంతా గాలించినా ఒక్క కసరు పిందైనా లేకపోయింది. గ్రామస్థులు తోటను చూచి విస్తుపోయారు. మాతోటకుపట్టినగతిని చూస్తూంటే నాకు దుఃఖం ముంచుకొస్తూంది. నా సహోపాధ్యాయుడు సైతం తోటకు పడ్డకష్టం తలచుకొని బావురుమంటూ యేడ్చాడు.

"ఎందుకు యేడుస్తారండి" అంతా ఆదొంగ వెధవలు చేసేపని" అన్నాడొక గ్రామస్థుడు.

"వాడు కాకపోతే మరెవరు వస్తారు? "అన్నాడు మరొక గ్రామస్థ.

"ఈనాడు సంతకెళ్ళితే మన కాయలు తప్పక పట్టకోవచ్చు" నన్నారు మరొకరు; ఇలా యెవరికి తోచిన సలహాలు వారు వారు చెప్పి, కాళీచేతులతోనే వచ్చిన దారి బట్టారు గ్రామస్థులు.


దుఃఖపూరిత మనస్కులమై పది గంటలవరకూ ఆ తోటనే పట్టక తిరుగుతూ ఉండిపోయాము. ఇంతలో తపాలు బంట్రోతు "తపాలుసార్!" అంటూ ఒక కవరు చేతికిచ్చి వెళ్ళిపోయాడు. అది మా మేనేజిమంటునుండి వచ్చింది. చింపి చూచాను. "విజిట్ రిపోర్టుప్రకారం మీ బడితోట బాగుందని, అందులో కాయకూరలు సుమారు యాభైరూపాయల విలువ కలిగి వున్నవని తెలిసింది. గాన వెంటనే వాటిని కోయించి, మునసబుగారి సాయంతో దండోరా వేయించి గ్రామస్థులయెదట వేలం పాట పాడించి వచ్చిన డబ్బును వారంరోజులలోగా ట్రెజరీలో చెల్లించి రశీదు పంపండి." అని వుంది. అప్రయత్నంగానే రెండు కన్నీటిబొట్లు ఆ కాగితంపైబడ్డాయి. దీనితో "గోరుచుట్టుపై రోకలిదెబ్బ"లా గయింది పాపని. వెంటనే గ్రామమునసబు వద్దకెళ్ళి "బడితోటలోకూరలన్నీ పోయాయి. ఆమాట తీయించండిసార్" అని మొత్తుకొన్నాను. తుదకు మేనేజిమెంటునుండి వచ్చిన ఉత్తర్వును చూపించి తోటకూరలన్నీ దొంగతనం పోయాయని ఒక సర్టిఫికేటు యిమ్మన్నాను. "పోవయ్యా! నా గ్రామంలో దొంగతనం పోయిందంటే అది నాకవమానం. అలా నేను సర్టిఫైచేయడానికి వీలులేదు" పొమ్మన్నారు.

ఆదినమంతా నాకు పిచ్చిపట్టినట్లనిపించింది. యేం చేయడానికీ తోచలేదు. చేచేతులా పెంచిన తోట పోయిందేలని ఒకప్రక్క, యింతకష్టించి తుదకు మేనేజిమెంటు వద్ద చెడ్డపేరు వస్తుందేమోనని మరోప్రక్క వేధించుకతింటూంది. "అధికార్లకు నిజంచెప్తే తప్పేముందని?" సలహాయిచ్చాడు సహోపాధ్యాయుడు ఆలాగనే ఉన్న వాస్తవవిషయాలు మేనేజిమంటుకు తెలుపుకొన్నాను.

వారంగడచింది. మేనేజిమెంటు నుండి ఉత్తర్వు వచ్చింది. బడిసొత్తులు జాగ్రత్తగా కాపాడలేక పోయూరనే కారణాన మా యిరువురికి తలకొక గ్రామానికి పనిష్మెంటు ట్రాన్స్ఫరు చేశారు.

హారి భగవంతుడా! అనుకొంటూ మూటాముల్లె సర్దుకొని బయలుదేరాము చెరొకప్రక్క.


రొమ్ము దగ్గు





దగ్గులు, ఆయాసం, గొంతు పుండ్లు, బ్రాంకైటిస్, ఇన్ఫ్లూయెంజా మున్నగునవి ప్రమాదకరమైనవి-శ్వాస విరోధాలన్నిటినీ పెప్స్‌తో తొలగించండి. పెప్స్ ఉచ్ఛ్వాస నిశ్వాసాలను సులభతరం చేస్తుంది. పెప్స్‌లోని అమూల్యమైన ఔషధ సారములు రొమ్ము, ఊపిరి తిత్తుల అంతర్భాగాలలోనికి చొరబడుతాయి. అందువల్లనే పెప్స్ సత్వరంగా దగ్గులను నివారించి, మంటను అరికట్టుతుంది. హానికరమైన క్రిములను సంహరించి, ఊపిరితిత్తులకు, గొంతుకకు, బాధోపశమనం కలిగిస్తుంది. పెప్స్-వాడవలసిందని వైద్యులు సిఫారసు చేస్తారు.

పెప్స్ సేవించండి.

PEPS

క్రిమి సంహారకరమైన గొంతు, రొమ్ము బిళ్ళలు.




మద్రాసు సోల్ ఏజంట్లు. దాదా & కంపెనీ, పార్కు టౌన్, మద్రాసు-3.